

ఇద్దరు సీఐల బదిలీ

కర్నూలు, ఫిబ్రవరి 28: ఉమ్మడి జిల్లాలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ సెంథిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బనగానపల్లె సీఐగా గంటా సుబ్బారావును నియమించారు. ఈయన ప్రస్తుతం ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ సీఐగా ఉన్నారు. అలాగే నంద్యాల ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ కంబగిరి రాముడును ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ సీఐగా బదిలీ చేశారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయ ఏవోగా రత్న కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం గ్రేహౌండ్స్ విభాగానికి ఏవోగా ఉన్నారు.





మల్టీ యుటిలిటీ నాలెడ్జ్ సెంటర్‌కు కేటాయించిన క్రీడాస్థలం

అక్కడే ఎందుకు...?

- మల్టీ యుటిలిటీ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణం
- వైద్య కళాశాల ఆట స్థలంలో 60 సెంట్ల కేటాయింపు
- రూ.60 కోట్లకు పైగా విలువైన స్థలం కాజేసే కుట్రేనా?
- ప్రధాన రోడ్డు పక్కనే ఇవ్వడంపై అభ్యంతరాలు

కర్నూలు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి)/కర్నూలు హాస్పిటల్:

కర్నూలు మెడికల్ కళాశాల (కేఎంసీ) ఆట స్థలంలో బహుళ ప్రయోజనాల కేంద్రం (మల్టీ యుటిలిటీ సెంటర్) నిర్మాణం కోసం పూర్వ విద్యార్థుల సంఘం (ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్) ముందుకు వచ్చింది. ఈ సెంటర్ నిర్మాణంపై ఎవరికి ఎలాంటి అభ్యంతరాలు లేవు.. అయితే వాణిజ్య అవసరాలకు అనుకూలమైన రూ.కోట్ల విలువ చేసే ప్రధాన రోడ్డు పక్కన గల 60 సెంట్ల స్థలం కేటాయించడంపైనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మల్టీ యుటిలిటీ సెంటర్ కేంద్రం ముసుగులో విలువైన స్థలం కబ్జా చేసే కుట్రలో భాగంగానే ఎన్నికల ముందు ఈ సెంటర్‌ను తెరపైకి తెచ్చారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యార్థుల ప్రయోజనార్థమే ఈ కేంద్రం నిర్మించేటట్లయితే శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ పక్కనే ఎందుకు కేటాయించారు..? గతంలో కేటాయించిన న్యూ లెక్చరర్స్ గ్యాలరీ ముందు, కొత్తగా నిర్మించి స్టేట్ క్యాన్సర్ యూనిట్ సమీపంలో ఖాళీ స్థలంలో నిర్మించవచ్చు కదా.. అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భావం తరువాత వెనుకబడిన రాయలసీమ జిల్లాల్లో మెడికల్ కాలేజీ నిర్మించాలనే ప్రతిపాదన వచ్చింది. కర్నూలు నగరంలో కర్నూలు వైద్య కళాశాల (కేఎంసీ) నిర్మాణానికి 1955 నవంబరు 29న జీవో నంబరు 1835 జారీ చేశారు. నాడు రాష్ట్రంలోనే మూడో కాలేజీ ఇది. 50 మంది విద్యా విద్యార్థులతో క్లాసులు ప్రారంభించారు. వంద ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 36 వైద్య యూనిట్లు ఏర్పాటు చేశారు. ఏటా 250 అండర్ గ్రాడ్యుయేట్స్ ప్రవేశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ కాలేజీలో 1,000 ఎంబీబీఎస్, 250 మంది హౌస్ సర్జన్స్, 400 మంది పోస్టుగ్రాడ్యుయేట్స్ (పీజీ) కలిపి 1,650 మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ చదువుకున్న వైద్యులు రాష్ట్రం, దేశంలోనే కాదు.. ప్రపంచంలోని వివిధ దేశాల్లో ప్రముఖ స్థిరపడ్డారు. కేఎంసీ ఓల్డ్ స్టూడెండ్స్ అసోషియేషన్ - అలుమ్ని, నార్త్ అమెరికా కేఎంసీ ఓల్డ్ స్టూడెంట్స్ అసోషియేషన్‌గా ఏర్పడి.. కళాశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం వంటి వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే కేఎంసీ గ్రాడ్యుయేట్స్ ట్రస్ట్‌గా ఏర్పడి మల్టీ యుటిలిటీ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిని వైద్యులు, వైద్య విద్యార్థులు స్వాగతిస్తున్నారు. అయితే.. ఈ సెంటర్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలం విషయంలోనే తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయి. రూ.కోట్ల విలువ చేసే కాలేజీ ప్లేగ్రౌండ్ కబ్జా చేయాలనే కుట్ర దాగి ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.





మల్టీ యుటిలిటీ నాలెడ్జ్ సెంటర్‌కు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

రూ.60 కోట్లకు పైగా విలువైన స్థలం

వైద్య విద్యార్థు కోసం మల్టీ యుటిలిటీ నాలెడ్జ్ సంటర్ నిర్మాణం స్థలం కావాలని కేసీఎం గ్రాడ్యుయేట్స్ ట్రస్ట్ కోశాధికారి మహేశ్‌కుమార్ మర్డా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) లేఖ రాశారు. ప్రభుత్వంలోని పెద్దలు ద్వారా చక్రం తిప్పారు. దీంతో ఆగమేఘాలపైన ఫైల్ ముందుకు కదిలింది. మెడికల్ కాలేజీ ఆట స్థలం (ప్లేగ్రౌండ్)లో 60 సెంట్లు కేటాయించారు. ఈ స్థలం నగరం వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉంది. ఇక్కడ బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం సెంటు రూ.కోటికి పైగానే పలుకుతోంది. అంటే.. ఆ స్థలం రూ.60 కోట్ల పైమాటే. ఎంతో విలువైన.. భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే స్థలాన్ని నాలెడ్జ్ సెంటర్ పేరిట ప్రైవేటు ట్రస్ట్‌కు కేటాయించడం అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వైద్య విద్యార్థులకు నాలెడ్జ్ సెంటర్ నిర్మించాలనుకోవడం మంచి నిర్ణయమే. అయితే.. రూ.కోట్ల విలువ చేసే ఆట స్థలం కేటాయించడం ఎంతవరకు సబబు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ సెంటరు పేరిట ప్రధాన రోడ్డు వైపు షాపింగ్ కాంప్లెక్స్ (వాణిజ్య దుకాణాలు) నిర్మించాలనే యోచన ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు అధికార వైసీపీ కీలక నాయకులు, ఓ ప్రజాప్రతినిధి ద్వారా చక్రం తిప్పి ప్రభుత్వం పెద్దలపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. రూ.60 కోట్లకుపైగా విలువైన స్థలం తీసుకోవడం వెనుక స్వార్థ ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నిజంగా సేవా చేయాలనే చిత్తశుద్ధి ఉంటే.. గతంలో ప్రతిపాదించిన మేరకు న్యూ లెక్చరర్ గ్యాలరీ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో లేదంటే స్టేట్ క్యాన్సర్ యూనిట్ వెనకాల ఉన్న ఖాళీ స్థలంలో.. పీజీ హౌస్ సర్జన్ క్వార్టర్స్ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో.. లేదంటే ఇప్పుడు కేటాయించిన ప్లేగ్రౌండ్ పడమర వైపు నిర్మించవచ్చు. కానీ అలాంటి నిర్ణయం తీసుకోకపోవడానికి కారణం అందులో దాగి ఉన్న స్వార్థ ప్రయోజనమే ముఖ్యంగా కనిపిస్తోంది

కుచించుకుపోతున్న ఆట స్థలం

కేఎంసీ ఆట స్థలం (ప్లేగ్రౌండ్) ఏడు ఎకరాల్లో ఏర్పాటు చేశారు. వివిధ అవసరాలకు ఆట స్థలం కేటాయిస్తూ రావడంతో ప్రస్తుతం 4.30 - 5 ఎకరాలు మాత్రమే మిగిలింది. అందులో కూడా ప్రధాన రోడ్డుకు ఆనుకొని 60 సెంట్లు కేఎంసీ గ్రాడ్యుయేట్స్ ట్రస్ట్‌కు కేటాయించారు. వివిధ అవసరాలకు ఆట స్థలం కేటాయించడం ఎంతవరకు సబబు అని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు.

ఈ సెంటర్ వల్ల ఉపయోగాలు

కేఎంసీ గ్రాడ్యుయేట్స్ ట్రస్ట్ నిర్మించదలిచన మల్టీ యుటిలిటీ నాలెడ్జ్ సెంటర్‌లో భాగంగా సెలిట్ కోర్టు, టెబుల్ టెన్నీస్, ఆడిటోరియం, రీడింగ్ రూం, డిజిటల్ లైబ్రరీ సహా విద్యార్థులు తల్లిదండ్రులు, బంధువులు వస్తే విశ్రాంతి కోసం గదులు నిర్మిస్తారు. ఇందు కోసం రూ.35 కోట్లు అవసరం అవుతాయని అంచనా. ఈ నిధులను కేఎంసీ ఓల్డ్ స్టూడెంట్స్ అసోషియేషన్, నార్త్ అమెరికా కేఎంసీ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ సమకూర్చనుంది. ప్రస్తుతం కేఎంసీ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ (అలుమ్ని) వద్ద ఉన్నది రూ.1.50 కోట్లే అని తెలుస్తోంది. మిగిలిన డబ్బులు వివిధ దేశాల్లో స్థిరపడిన కేఎంసీ ఓల్డ్ స్టూడెంట్స్ అయిన ఎన్ఆర్ఐలు సమకూరుస్తారని ఆ సంఘం నాయకులు అంటున్నారు.

డీఎంఈ కేటాయించారు

కేఎంసీ ప్లేగ్రౌండ్‌లో మల్టీ యుటిలిటీ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణం కోసం కేఎంసీ గ్రాడ్యుయేట్స్ ట్రస్ట్‌కు 60 సెంట్లు కేటాయించిన మాట నిజమే. ఈ ట్రస్ట్ ప్రభుత్వానికి విన్నవిస్తే పరిశీలించి డీఎంఈ ఈ స్థలాన్ని కేటాయించారు. ఇదే విషయాన్ని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఈ నాలెడ్జ్ సెంటర్ ట్రస్ట్ నిర్మాణం చేపడితే నాణ్యతా ప్రమాణాలు పర్యవేక్షించమని మాత్రమే మాకు చెప్పారు. అంతకు మించి మాకు ఎలాంటి సమాచారం లేదు.

- డాక్టర్ పి.సుధాకర్, ప్రిన్సిపాల్, కర్నూలు వైద్య కళాశాల, కర్నూలు



తెరపైకి ఇంతియాజ్..!

- కర్నూలు వైసీపీ టికెట్ రేసులో ఐఏఎస్ అధికారి
- ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ
- ఆగమేఘాలపై ఆమోదించిన ప్రభుత్వం
- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు ఆశాభంగం
- మూణ్నాళ్ల ముచ్చటగా ఇలియాజ్ బాషా పేరు



ఇంతియాజ్



హాఫీజ్‌ఖాన్

కర్నూలు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సీట్లాట రసవత్తరంగా మారింది. నోటిఫికేషన్ ఈసారి ఎన్నికల్లో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ గెలవలేరని వైఎస్ జగన్ ఆయనకు టికెట్ నిరాకరించారు. ఆ స్థానంలో నీవే మా అభ్యర్థి అంటూ డాక్టర్ ఇలియాస్‌బాషాను తెరపైకి తెచ్చారు. ఆయన పేరు వారం రోజుల పాటు నియోజకవర్గ వ్యాప్తంగా చక్కర్లు కొట్టింది. ఈ క్రమంలో తాజాగా సెర్ప్, మైనార్టీ సంక్షేమ శాఖ సీఈఓ, సీసీఎల్‌ఏ కార్యదర్శిగా పని చేస్తున్న ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ అహ్మద్ పేరు తెరపైకి వచ్చింది. కర్నూలు వైసీపీ అభ్యర్థిగా సీఎం జగన్ ఖరారు చేసినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. త్వరలో విడుదలయ్యే తొమ్మిదో జాబితాలో ఆయన పేరును ప్రకటించే అవకాశం ఉంది. కృష్ణా జిల్లా కలెక్టరు, సెర్ప్, మైనార్టీ వెల్ఫేర్ సీఈఓగా పని చేసిన ఏఎండీ ఇంతియాజ్ వైసీపీలో గ్రూపు రాజకీయాలు, కుమ్ములాటలు తట్టుకొని రాజకీయాల్లో రాణిస్తారా? అన్నది ప్రశ్నార్థకమే.

హాఫీజ్‌కు బుజ్జగింపు..

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎంపికలో పలు మలుపు తిరుగుతోంది. 2019 ఎన్నికల్లో వైసీపీ టికెట్‌పై గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టిన ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ రాబోయే ఎన్నికల్లో గెలవలేరు అంటూ ఆ పార్టీ అధిష్ఠానం పక్కన పెట్టింది. ఈ నెల 22న తాడేపల్లి ప్యాలెస్‌కు హాఫీజ్‌ఖాన్‌ను పిలిపించారు. టికెట్ ఇవ్వలేమని, భవిషత్తులో రాజకీయంగా మంచి అవకాశాలు ఉంటాయని బుజ్జగించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆర్థో విభాగం ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఇలియాస్‌బాషాకు టికెట్ ఇస్తామని, గెలుపించుకు రావాలని హాఫీజ్‌ఖాన్‌కు సీఎం జగన్ సూచిస్తే.. సరే అన్నా! నా భవిషత్తు ఏమిటీ..? అని హాఫీజ్‌ఖాన్ అడిగినట్లు సమాచారం. దీంతో జగన్ హాఫీజ్‌ఖాన్‌ను నచ్చచెప్పి పంపించారు. ఇదిలా ఉండగా ఇంతియాజ్‌ను తెరపైకి తీసుకురావడంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాత్ర ఉన్నట్లు సమాచారం.

తెరపైకి ఇంతియాజ్!

ఎమ్మిగనూరు వైసీపీ అభ్యర్థిగా మాచాని వెంకటేశ్‌ను అధికారింగా ప్రకటించి.. ఆ వెంటనే మాజీ ఎంపీ బుట్టా రేణుకను ప్రటించారు. అదే ఫార్మలాను కర్నూలు అభ్యర్థి ఎంపికలోనూ అనుసరించారు. జగన్ ప్రభుత్వంలో కీలకమైన చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ), సెర్ప్ సీఈఓ, మైనార్టీ సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రెటరీ ఏఎండీ ఇంతియాజ్ అహ్మద్ (2009 బ్యాచ్ ఐఏఎస్ అధికారి)ను కర్నూలు వైసీపీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఆయన వాలంటరీ రిటైర్మెంట్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద ఉద్యోగ విరమణ దరఖాస్తును ఆమోదించింది. ఆయన చేసిన దరఖాస్తును తక్షణమే ఆమోదిస్తున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతియాజ్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కోసం మూడు నెలల ముందస్తు నోటీసు ఇవ్వాలన్న నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చినట్లు ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ఆర్టీ నంబర్ 477లో పొందుపరిచారు. ఈ మేరకు నాన్ కేడర్ ఐఏఎస్‌గా ఉన్న ఇంతియాజ్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ దరఖాస్తును అనుమతిస్తూ జవహర్ రెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు.

ఇంతియాజ్ నేపథ్యం : ఏఎండీ ఇంతియాజ్ స్వగ్రామం కోడుమూరు. కర్నూలు నగరంలో ప్రముఖ కేఎం హాస్పిటల్ అధినేత దివంగత డాక్టర్ ఇస్మాయిల్‌కు ఆయన స్వయాన అల్లుడు. జిల్లాలో బంధువర్గం, పరిచయాలు ఉన్నప్పటికి.. 2009లో ఐఏఎస్‌గా ఎంపికయ్యాక ఉద్యోగ రీత్యా ఎక్కువ కాలం బయటనే ఉన్నాడు.



పొలంలో ఉన్న బాక్సులు

పొలాల్లో శానిటరీ ప్యాడ్స్

- వందల బాక్సులు నిలువ
- పక్కదారి పట్టించడానికేనా..?

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 28: ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు అందవలసిన శానిటరీ నాప్కిన్స్ (ప్యాడ్స్) పక్కదారి పట్టిస్తున్నారు. ఏకంగా వందల బాక్సులు ఆదోని పట్టణ శివారు ప్రాంతంలోని భరత్‌నగర్ సమీప పొలంలో నిలువ ఉంచారు. అసలు అక్కడ ఎందుకు దాచారో అంతుచిక్కని ప్రశ్న. ప్రభుత్వం ఉచితంగా ఆరో తరగతి నుంచి బాలికలకు శానిటరీ ప్యాడ్స్ అందిస్తోంది. వాటిని నేరుగా జిల్లా విద్యాశాఖ నుంచే ఆయా ప్రభుత్వం పాఠశాలలకు కాంట్రాక్టర్ ద్వారా విద్యార్థినుల సంఖ్యను బట్టి శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేస్తుంది. పాఠశాలలో ఒక మహిళ టీచర్‌కు బాధ్యత అప్పజెప్పి విద్యార్థినులకు అందజేస్తున్నారు. గ్రామీణ ప్రాంత, పేద విద్యార్థినులు నెలసరి సమయంలో పరిశుభ్రంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వాటిని పంపిణీ చేస్తోంది. అయితే కాంట్రాక్టర్ స్కూళ్లకు పంపిణీ చేయకుండా వాటిని పక్కదారి పట్టించి విక్రయించుకునేందుకు చూస్తున్నట్లు సమాచారం. పంట పొల్లాల్లో వందల కొద్ది ప్యాడ్స్ లారీకి సరిపడా బాక్సులను దాచారు. వాటి విలువ రూ.లక్షల్లోని ఉంటుందని తెలుస్తోంది. పొలంలోని ఓ వ్యక్తిని విచారించగా అవి ఆదోని మండలానికి సంబంధించినవి కాదని, గూడూరుకు సరఫరా చేస్తున్నామని, స్థలం లేక పొలంలో నిలువ ఉంచినట్లు తెలిపారు. సదరు వ్యక్తి వివరాలను తెలిపేందుకు కూడా నిరాకరించారు.




నేరుగా కాంట్రాక్టర్ ద్వారా పంపిణీ

ఆదోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థినులకు పరిశుభ్రంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేస్తోంది. నేరుగా ప్రభుత్వమే జిల్లా కేంద్రాల నుంచి కాంట్రాక్టర్‌కు అప్పజెప్పి పాఠశాలలకు సరఫరా చేస్తారు. అక్కడ ఎందుకు దాచారో తెలియడం లేదు. విచారించి చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాసులు, ఎంఈవో

'మహా'వేడుకలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి శ్రీశైలంలో శివరాత్రి ఉత్సవాలు
- 8న పాగాలంకరణ, కల్యాణోత్సవం
- భారీగా తరలిరానున్న భక్తులు



శ్రీశైలం, ఫిబ్రవరి 28: ఇల కైలాసంగా భావించే శ్రీశైలంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్వామివారి యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. పదకొండు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో స్వామి అమ్మవార్లకు వివిధ సేవలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. 41 రోజుల పాటు కఠోర దీక్షను కొనసాగించిన శివస్వాములు శివరాత్రి సందర్భంగా దీక్షలను విరమిస్తారు.

ముఖ్య కార్యక్రమాలు ఇలా..

1వ తేదీ, శుక్రవారం	ధ్వజారోహణ
2వ తేదీ, శనివారం	భృంగి వాహనసేవ
3వ తేదీ, ఆదివారం	హంస వాహనసేవ
4వ తేదీ, సోమవారం	మయూర వాహనసేవ
5వ తేదీ, మంగళవారం	రావణ వాహనసేవ
6వ తేదీ, బుధవారం	పుష్ప పల్లకి
7వ తేదీ, గురువారం	గజవాహన సేవ
8వ తేదీ, శుక్రవారం	పాగాలంకరణ, కల్యాణోత్సవం
9వ తేదీ, శనివారం	రథోత్సవం, తెప్పోత్సవం
10వ తేదీ, ఆదివారం	యాగ పూర్ణాహుతి, ధ్వజావరోహణ
11వ తేదీ, సోమవారం	అశ్వవాహన సేవ, శయనోత్సవం

పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

కేజీబీవీని తనిఖీ చేసిన సమగ్ర శిక్ష రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 28: కేజీబీవీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గీత అన్నారు. మంగళవారం రాత్రి ఆదోని పట్టణంలోని వైయస్సార్ నగర్‌లో ఉన్న కేజీబీవీ జనరల్ విద్యాలయాన్ని రాత్రి ఆమె అకస్మికంగా జీసీడీవో సునీతతో కలిసి తనిఖీ చేశారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా...? లేదా అని ఆరా తీశారు. వంట గదిలో సామగ్రిని, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం పది, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. పంచతంత్ర యాక్షన్ ప్లాన్ తెలియజేశారు. ఆడపిల్లలకు చదువు ప్రాముఖ్యత వివరించారు. ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ శాంతి ఉన్నారు.

ఆర్‌యూ విధుల్లోకి ఉద్యోగులు

నియామక పత్రాలు అందజేసిన వీసీ

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 28: గత ఏడాది నకిలీ సర్టిఫికెట్ల ఆరోపణలతో తొలగించిన ఇద్దరు ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నట్లు రిజిస్ట్రార్ నాగుల అంకన్న తెలిపారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలోని ఉపకులపతి చేతుల మీదుగా టైమ్ స్కేల్ ఉద్యోగులైన బి. బాబు, బీ. లక్ష్మీదేవిలకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు కోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం ఆదేశాల మేరకు ధ్రువపత్రాలను పరిశీలనలో సరైనవేనని నిర్ధారణ కావడంతో విధుల్లోకి తీసుకున్నట్లు తెలిపారు. ఉపకులపతి మానవతా దృక్పథంతో స్పందించిన తీరు ఉద్యోగులకు న్యాయం జరిగిందని నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు సురేంద్ర హర్షం వ్యక్తం చేశారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఒక నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- టోల్‌ఫ్రీ నెంబర్ 08518-222047

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 28: మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కన్వీనర్ ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 166 కళాశాలల నుంచి ఇంటర్ విద్యార్థులు 47,412 మంది పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 22,239 మంది కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 25,173 మంది ఉన్నారన్నారు. ఈ విద్యార్థుల కోసం మొత్తం 69 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈసారి సెల్ఫ్ సెంటర్లు లేవని, అయితే 17 కంబైన్డ్ సెంటర్లను ఏర్పాటు చేశామని అన్నారు. ఈ పరీక్షల్లో 69 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామన్నారు. 1650 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొంటారన్నారు.

నాణ్యమైన స్టేషనరీ, పోలింగ్ సామగ్రిని సరఫరా చేయండి

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 28: నాణ్యతతో కూడిన స్టేషనరీ, పోలింగ్ సామగ్రిని సరఫరా చేయాలని జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్, జాయింట్ సెక్రటరీ నారపురెడ్డి మౌర్య టెండర్ ఏజెన్సీలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు స్టేషనరీ, పోలింగ్ మెటీరియల్‌ను సరఫరా కోసం టెండర్ ఓపెనింగ్ కార్యక్రమాన్ని జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్, జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కొనుగోలు కమిటీ కన్వీనర్ డీఆర్వో మధుసూదన్‌రావు, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు జయమ్మ, పరిశ్రమల శాఖ జీఎం, డిస్ట్రిక్ట్ సప్లయ్ ఆఫీసర్ కేవీఎస్ఎం ప్రసాద్, జిల్లా ఆడిట్ అధికారి రమేష్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

చాగలమర్రి, ఫిబ్రవరి 28: మండలంలోని శెట్టివీడు గ్రామానికి చెందిన మహేశ్వరి అనే మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మహేశ్వరి కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెందిన ఈ దారుణానికి పాల్పడింది. కుటుంబీకులు 108 వాహనంలో స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు జరిగిన సంఘటనపై విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వికలాంగుల సంఘం నాయకుడి మృతి

ఆటోలో వెళుతుండగా పత్తికొండ బైపాస్‌లో ప్రమాదం

పత్తికొండ, ఫిబ్రవరి 28 : పత్తికొండ బైపాస్ రోడ్డులో పుచ్చకాయలమాడ క్రాస్‌వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డుప్రమాదంలో వికలాంగుల సంఘం నాయకుడు వీరప్రకాష్ (49) మృతి చెందాడు. పత్తికొండ నుండి పుచ్చకాయలమాడ గ్రామానికి ప్రయాణికులతో ఆటో సాయంత్రం బయలుదేరింది. ఆర్టీసీ డిపో దాటి బైపాస్ రోడ్డులో పుచ్చకాయలమాడ క్రాస్ వద్దకు చేరుకోగా.. ట్రాలీలో వ్యవసాయ పనిముట్లతో వెళుతున్న ట్రాక్టర్ ఎదురైంది. ట్రాక్టర్ ట్రాలీ వెనుక వేలాడుతున్న ఇనుప వ్యవసాయ పనిముట్లు ఆటోలో ప్రయాణిస్తున్న ప్రకాష్‌కు తగిలి తలను చీల్చుకుంటూవెళ్లాయి. ఆటోలో ఉన్న పాముల కిష్టన్న చేతివేళ్లు తెగిపోయాయి. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని పత్తికొండ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ప్రకాష్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. చేతివేళ్లుతెగిన కిష్టన్నను మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. మృతిచెందిన వీరప్రకాష్ మహాత్మా దివ్యాంగుల ప్రాంతీయసమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. కిష్టన్న ఉచ్చకాయలమాడలో టీడీపీ కార్యకర్త.

కేఈ శ్యాంబాబు పరామర్శ..

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు పత్తికొండ ఆసుపత్రికి చేరుకుని మృతిచెందిన వీరప్రకాష్ కుటుంబాన్ని, టీడీపీ కార్యకర్త పాముల కిష్టన్నను పరామర్శించారు. ఆయనతోపాటు పుచ్చకాయలమాడకు చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 28 : నంద్యాల మండలం పోలూరు గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. పోలూరు గ్రామంలో పూల చిన్న మద్దిలేటి (27) తన ఇంట్లో నీరు పట్టేందుకు సమీపంలోనే ఉన్న కుళాయి నుంచి మోటార్‌కు కనెక్షన్ ఇచ్చాడు. ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో మద్దిలేటి మృతి చెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. మృతుడు చిన్నమద్దిలేటికి వివాహమైనట్లు పేర్కొన్నారు.

నేడు కోసిగి ఎల్లమ్మ రథోత్సవం



కోసిగి, ఫిబ్రవరి 28: కొలిచేవారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కోసిగి రేణుకా ఎల్లమ్మ అమ్మవారి రథోత్సవం గురువారం వైభవంగా జరగనుంది. ఈ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ పూజారులు ఉమేష్‌గౌడు, మల్లయ్యగౌడు, చంద్రయ్య గౌడులు తెలిపారు. ఈ రథోత్సవానికి వేలాదిగా భక్తులు తరలి రానున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా తాగునీరు ఇలా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు కోసిగి మేజర్ గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ తెలిపారు. జాతర సందర్భంగా గట్టి పోలీసు బందోబస్తు ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కోసిగి సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు.





బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం

నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి

మహానంది, ఫిబ్రవరి 28: మహానంది మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని నంద్యాల ఆర్డీఓ మల్లికార్జున రెడ్డి, ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం 200 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా పెంచుతామని తెలిపారు. ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది కంటే శివరాత్రికి మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మార్చి 8వ తేదీ రాత్రి 10 గంటల నుంచి క్షేత్రంలో జరిగే లింగోద్భవ పుణ్యకాలంలో రూ.100 టిక్కెట్లు విక్రయించి భక్తులకు దర్శనం కల్పిస్తామని చెప్పారు. మహానంది నుండి గాజులపల్లి వైపు వెళ్లే మూడు కిలో మీటర్ల రహదారికి తాత్కాలిక మరమ్మతులు మరో మూడు రోజుల్లో పూర్తి చేస్తామని ఆర్ అండ్‌బీ డీఈఈ సురేష్ తెలిపారు. తమ్మడపల్లి మలుపు వద్ద ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకుల వద్ద పెయింటింగ్‌తో గుర్తులు వెయిస్తామని చెప్పారు. నంద్యాల మున్సిపాలిటీ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ అంకిరెడ్డి మాట్లాడుతూ మహానందిలో మూడు రోజులపాటు సిబ్బందితో పారిశుధ్య పనుల నిర్వహణతోపాటు దోమల నివారణకు పరిసరాల్లో ఫాగింగ్ చేయిస్తామన్నారు. ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ గౌస్‌బాషా మాట్లాడుతూ మహానందిలో మార్చి 8,9,10 తేదీల్లో మూడు రోజుల పాటు ప్రభుత్వ మద్యం షాపును బంద్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి, వైద్యాధికారి భగవాన్‌దాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, నంద్యాల ఆర్టీసీ డీఎం గంగాధర్, ఇన్‌చార్జి డీఎల్‌పీఓ వెంకటేశ్వరరావు, మండల ఏవో శ్రీనివాసరెడ్డి, మహానంది దేవస్థానం ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి

రాజకీయ కక్షతోనే మల్లెల రాజశేఖర్‌పై రౌడీషీట్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 28: అధికార పార్టీ నాయకుల రాజకీయ కక్షతోనే మాజీ జడ్పీ చైర్మన్, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌పై రౌడీషీట్ ఓపెన్ చేశారని మాజీ ఎంపీటీసీ నాగారాజు ఆరోపించారు. బుధవారం మండలంలోని హుశేనాపురం గ్రామం నుంచి బైక్, ట్రాక్టర్లు, వాహనాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, బీసీ సోదరులు భారీ ర్యాలీగా వచ్చి ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారిని దిగ్బంధించారు. దీంతో రోడ్డుకిరువైపులా భారీ వాహనాలు నిలిచిపోయాయి. మల్లెలపై పెట్టిన రౌడీషీట్‌ను ఎత్తివేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఎస్ఐ రాజారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐతో మాట్లాడారు. ఈ విషయంపై జిల్లా అధికారులతో చర్చించి మల్లెల రాజశేఖర్‌పై పెట్టిన రౌడీషీట్‌ను ఎత్తివేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళనకారులు నిరసన కార్యక్రమాన్ని విరమింపజేశారు. ఈ సందర్భంగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రహదారిపై మాట్లాడుతూ రాజశేఖర్‌పై పెట్టిన అక్రమ, రౌడీషీట్‌ను ఎత్తేయాలని కోరారు. ఈ విషయం ఎస్పీ కృష్ణకాంత్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మైనార్టీ నాయకుడు మహబూబ్ బాషా, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు రాము, కాపు సంఘం యువ నాయకుడు కేవీ మధు, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు కక్షతోనే మల్లెల రాజశేఖర్‌పై రౌడీషీట్ ఓపెన్ చేయించారని అన్నారు. బీసీ వర్గాన్ని అణిచివేసేందుకే ఈ కేసు పెట్టారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షమీనా, నాయకులు ప్రశాంత్, బజారు, వడ్డె నారాయణ, గడ్డెకారి చంద్రశేఖర్, రజాక్, ఖాదర్, శేఖరప్ప, జయకృష్ణ, రామగోవిందు, రామచంద్రుడు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జాతీయ రహదారి దిగ్బంధం.. నిలిచిపోయిన వాహనాలు



ధర్నా ముగిశాక టీడీపీ మహిళలతో మాట్లాడుతున్న గౌరు చరిత



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పెళ్లింట విషాదం

రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కుమారుడి మృతి

మద్దికెర, ఫిబ్రవరి 28: తెల్లారితే.. చిన్నాన్న కొడుకుది పెళ్లి.. బంధువులంతా వస్తున్నారు.. ఆ ఇంట శుభకార్యం జరగాల్సి ఉండగా..దూర ప్రాంతాల నుంచి వస్తున్న బంధువులను తీసుకువచ్చేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో నవీన్ (25) అనే యువకుడు బుధవారం మృతి చెందాడు. మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన వడ్డె రామాంజులు, సుధారాణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తెకు వివాహం చేశారు. నవీన్ ఒక్కగానొక్క కుమారుడు. నవీన్ పదో తరగతి పూర్తి చేసుకుని బెల్దార్ పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారి చిన్నాన్న రంగస్వామి కుమారుడు శివశంకర్ పెళ్లి గురువారం పెరవలి గ్రామంలో జరగనుంది. ఈ వివాహానికి బంధువులు గుంతకల్లుకు వస్తుండటంతో వారిని తీసుకురావడానికి మంగళవారం రాత్రి మరో ముగ్గురు మిత్రులతో కలిసి జీపులో నవీన్ గుంతకల్లుకు వెళ్లాడు. పెరవలి గ్రామ శివారులో జీపు టైరు పేలి బోల్తా పడింది. జీపులో ఉన్న నవీన్‌కు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు తరలించారు. మిగతా ముగ్గురుకి స్వల్ప గాయాలు అయ్యాయి. నవీన్ కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. నవీన్‌కు వివాహం కాలేదు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు చోటు చేసుకున్నాయి. నవీన్ మృతి చెందడంతో ఆ ఇంట్లో వివాహం నిలిచిపోయింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వడ్డె నవీన్(ఫైల్)



రోధిస్తున్న కుటుంబ సభ్యులు

గురు వైభవ -2024 అవార్డులకు పలువురి ఎంపిక

మంత్రాలయం, ఫిబ్రవరి 28: గురువైభోత్సవాల్లో భాగంగా మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం అందజేసే అవార్డులకు పలువురు ప్రముఖులు ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంత్రాలయం మఠం ఏఏఓ మాధవశెట్టి బుధవారం వెల్లడించారు. మార్చి 12వ తేదీన రాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషేకం, 16వ తేదీన 429వ రాఘవేంద్రస్వామి జన్మదినోత్సవ వేడుకలను ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులకు గురువైభవ అవార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. అవార్డుకు ఎంపికైన వారిలో రాష్ట్ర హైకోర్టు జడ్జిలు జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు, జస్టిస్ నరేందర్, జస్టిస్ శ్యాంసుందర్, జస్టిస్ హరినాథ్ నూనెపల్లె, కర్ణాటక హైకోర్టు జడ్జి శాంతిభూషణ్, రిటైర్డు అడ్వకేట్ జనరల్, ప్రభులింగ నావదగి, కర్ణాటక డిప్యూటీ సెక్రటరీ నాగరాజు, ఆకాష్ దొడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, ఆర్‌అండ్‌బీ స్పెషల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న, ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణ, ఎండోమెంట్ హిందూ సంప్రదాయ దేవదాయ కమిషనర్ బసవరాజేంద్ర, కర్నూలు ఎస్పీ జి.కృష్ణకాంత్, విజయనగర జిల్లా ఎస్పీ టీఎల్ శ్రీహరిబాబు, రాయచూరు ఎస్పీ నిఖిల్, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, రాజ్యసభ అడిషినల్ సెక్రటరీ సోమశేఖర్, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఉన్నారు. వీరితో పాటు కర్ణాటక రాష్ట్రం మైసూరు ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ శరణప్ప, బెంగుళూరు సంస్కృతి యూనివర్సిటీ వీసీ అహల్య, టీటీడీ విద్వాన్ విభూషణ్ శర్మ, మహానంది క్షేత్ర పండితులు విద్వాన్ వెంకట దుర్గ నాగేశ్వరశర్మ, విద్వాన్ రవిశంకర్ ఆవధాని, విజయవాడ మల్లేశ్వర టెంపుల్ విద్వాన్ విరూపాక్షం సహస్ర మహర్షి, బెంగుళూరు జయసింహ, వీరభన్నాంజే, రవిదేవరాయ సముద్ర, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, ఉడిపి మోహన్, ప్రమోద్ కుమార్, ముకుందజీ, అరుణాచార్, మధుసూదన్, యశోదమ్మ, చెన్నైకి చెందిన ప్రమోద్, సురేష్‌గౌడ, సంజీవ అనంతకృష్ణలకు అవార్డులకు ఎంపికయ్యారు. యోగేంద్ర కళామండపంలో ఆరు రోజుల్లో జరిగే వైభోత్సవాల్లో అవార్డులు, ప్రశంసాపత్రం, నగదు, వెండి గిన్నె ఫలపుష్ప మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి సన్మానిస్తున్నట్లు మఠం ఏఏఓ తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రాలయం మఠం ఏఏవో మాధవశెట్టి

బాలాజీ కాంప్లెక్స్‌లో చోరీ

కందిబ్యాళ్ల యజమాని ఇంట్లో బంగారం, వెండి అపహరణ

కుటుంబ సభ్యులంతా తీర్థయాత్రకు వెళ్లడంతో ఘటన

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 28 : నంద్యాల ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ కాంప్లెక్స్‌లో దొంగలు పడ్డారు. కందిబ్యాళ్ల మిల్లు యజమాని గుండా వెంకటేశ్వర్లు ఇంట్లో దొంగలుపడి దోచుకెళ్లారు. వారం క్రితం గుండా వెంకటేశ్వర్లు తన కుటుంబసభ్యులతో కలిసి మధుర క్షేత్రానికి వెళ్లారు. బాలాజీ కాంప్లెక్స్‌లో పక్కాగా రెక్కీ నిర్వహించిన దొంగలు మంగళవారం అర్ధరాత్రి ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడి బీరువాలోని 12 తులాల బంగారం, వెండి కేజీతోపాటు ఇతర విలువైన వస్తువులు దోచుకెళ్లినట్లు తెలుస్తోంది. పక్కింటివారు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెంకటేశ్వర్లు ఇంటికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఇంటి యజమాని నంద్యాలకు వస్తే చోరీ పూర్తి వివరాలు వెల్లడి అవుతాయన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

మార్క్‌ఫెడ్ ద్వారా శనగలు కొనుగోలు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 28 : మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి మద్దతు ధరతో శనగలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2023-2024 సంవత్సరం రబీలో సాగు చేసిన శనగ దిగుబడికి మద్దతు క్వింటం ధర రూ.5,440 చెల్లించి రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ఆదేశించారు. జిల్లాలోని ఈ క్రాప్, ఈ కేవైసీ చేయించుకున్న శనగ రైతులందరూ తమ సమీపంలోని రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లను నమోదు చేయించుకొని మద్దతు ధరకు శనగలు అమ్ముకోవాలని వ్యవసాయాధికారులు తెలిపారు. రైతుల నుంచి నాణ్యత ప్రమాణాలు కలిగిన శనగలను మాత్రమే కొంటామని మార్క్‌ఫెడ్ అధికారులు వెల్లడించారు.

గ్రావెల్ తవ్వుతున్న వారిపై కేసు

టిప్పర్లు సీజ్ చేసిన అధికారులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 28: కల్లూరు మండలం పరిధిలో తడకనపల్లె సమీపంలో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న వ్యక్తులపై కేసులు చేశామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 5 టిప్పర్లను సీజ్ చేశామని తెలిపారు. సీజ్ చేసిన వాటిని ఉలిందకొండ, కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లలో ఉంచామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ దీలీప్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

టీజీ వెంకటేశ్‌కు మాతృవియోగం



గౌరమ్మకు నివాళులర్పిస్తున్న టీజీ వెంకటేశ్ కుటుంబ సభ్యులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 28: రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాతృమూర్తి టీజీ గౌరమ్మ (96) గురువారం తెల్లవారుజామున 5.20 గంటలకు కాలధర్మం చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె కోలుకోలేక నగరంలోని గౌరి గోపాల్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఆమె మరణవార్త తెలుసుకున్న టీజీ కుటుంబం కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకొని జిల్లాలోని ప్రముఖులు, వివిధ పార్టీల నేతలు, ప్రజలు పెద్ద సంఖ్యలో నగరంలోని సంకల్‌బాగ్‌లోగల టీజీ వెంకటేశ్ నివాసానికి చేరుకున్నారు. ఆమెకు నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, మీనాక్షినాయుడు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కోట్ల సుజాతమ్మ, ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ, సీపీఐకి చెందిన జిల్లా, రాష్ట్ర నాయకులు, స్థానిక కార్పొరేటర్లు, వివిధ ప్రజా సంఘాల నేతలు, టీజీవీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఉద్యోగులు, టీజీ వెంకటేశ్ బంధువులు, మిత్రులు నివాళులు అర్పించారు. పలువురు టీజీ వెంకటేశ్, కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్‌లను కలిసి ఓదార్చారు.



విషాదవదనంలో టీజీ వెంకటేశ్, కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్, కుటుంబ సభ్యులు



నివాళులర్పిస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు

విధుల్లో చేరిన 234 మంది హౌస్ సర్జన్లు

ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించిన అధికారులు


మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి

కర్నూలు (హాస్పిటల్), ఫిబ్రవరి 28: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కొత్తగా చేరిన హౌస్ సర్జన్లుకు ధన్వంతరీ హాలులో బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. 234 మంది నూతన హౌస్ సర్జన్లకు ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో వార్డులో విధి నిర్వహణలో ఎలా నిర్వహించారో వివరించారు. రోగులకు ఎలా వైద్యం అందించాలి.. ఎలా ప్రవర్తించాలో, ఆసుపత్రి సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్ దిశానిర్దేశం చేశారు. ఆసుపత్రిలో ల్యాబ్‌కు పంపించే రిక్వేషన్ ఫామ్‌లో పలు ఓపీ, ఐపీ కేసులకు సంబంధించి యూహెచ్ఐడీ అంకెలు నెంబరును నమోదు చేయాలని తెలిపారు. నూతన హౌస్ సర్జన్లను తప్పనిసరిగా ఐడీ కార్డు, డ్రెస్ కోడును తప్పనిసరిగా వేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్లు డా.సి.ప్రభాకర్ రెడ్డి, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఆర్ఎంవో వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ శివబాల పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన


కాల్వబుగ్గ ఆలయంలో రీజినల్ జాయింట్ కమిషనర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 28: మండలంలోని కాల్వబుగ్గ ఆలయంలో మార్చి 8 నుంచి జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను దేవదాయ ధర్మదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎస్‌వీఎస్ఎస్ మూర్తి, సూపరింటెండెంట్ తిరుమల్ రెడ్డి పరిశీలించారు. అనంతరం వీరికి ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, లక్ష్మీనరసింహ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శివునికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోనేరును పరిసర ప్రాంతాలను వారు పరిశీలించారు. కాల్వబుగ్గలో కోనేరులో నీరు లేదని, ప్రత్యామ్నాయంగా బోరు వేశామని, వీటిలో కూడా నీరు పడలేదని అధికారులకు ఈవో వివరించారు.

కాల్వబుగ్గ ఉత్సవ కమిటీ నియామకం: మండలంలోని కాల్వబుగ్గలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీని నియమించినట్లు ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్ బుధవారం తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ నుంచి ఉత్సవ కమిటీ ఉత్తర్వులు అందాయన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా రామకృష్ణ, నాగరాజు, మహేశ్వరప్ప, రాజేష్, జి.లక్ష్మీదేవి, మద్దమ్మ, పాలమ్మ, నెనావత్ కళ్యాణీబాయి, సి.లక్ష్మీదేవి నియమించినట్లు ఈవో తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి: ఎంపీడీవో

సి.బెళగల్, ఫిబ్రవరి 28: ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో శకుంతల ఏపీవో లక్ష్మన్నకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యా లయం సమావేశ భవనంలో ఉపాధి సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో శకుంతల మాట్లాడుతూ జాబ్ కార్డులో పేరు ఉన్న వారు మాత్రమే ఉపాధి పనులకు రావాలన్నారు, పేరు లేనివారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఉదయాన్నే పనులకు రావాలన్నారు. అలాగే బోరు బావులు ఉన్న సన్నకారు రైతులు పండ్లతోటలను పెంచుకోవడానికి ముందుకు రావాలన్నారు. ఈసమావేశంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ డీసీపీగా సంధ్య

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 28: నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం డిప్యూటీ సిటీ ప్లానర్‌గా సంధ్యను నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ విద్యుద్దలత ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న డీసీపీ మోహన్ కుమార్ మెడికల్ లీవ్‌లో వెళ్లడంతో కుడాలో పని చేస్తున్న ఏసీపీ సంధ్యకు కార్పొరేషన్‌లో డీసీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మూడు గుడిసెలు దగ్ధం

కర్నూలు, ఫిబ్రవరి 28: నగరంలో శరీన్‌నగర్ ప్రాంతంలో మద్దమ్మ, శివమ్మ, కాశన్నలకు చెందిన మూడు గుడిసెలు దగ్ధమయ్యాయి. మొదట మద్దమ్మ ఇంట్లో గ్యాస్ సిలిండర్ గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. అక్కడే పక్కన ఉన్న గుడిసెలకు మంటలు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బం దికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో సుమారు 3లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: గౌరు చరిత


క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జిలకు ప్రచార సామగ్రి అందిస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

కల్లూరు, ఫిబ్రవరి 28: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ పాణ్యం అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. బుధవారం స్థానిక మాధవీనగర్‌లోని తన స్వగృహంలో పాణ్యం నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశం, శంఖారావం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కల్లూరు అర్బన్ వార్డుల కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు ప్రవేశపెట్టా రన్నారు. ఎన్నికలకు కేవలం 45 రోజులు మాత్రమే ఉందని టీడీపీ, జనసేన కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలు పునిచ్చారు. అనంతరం క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లకు ఎన్నికలకు సమాయత్తం చేస్తూ గౌరు చరిత దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఆయా మండలాల అధ్యక్షులు డి.రామాంజనేయులు, డి. గోవిందరెడ్డి, డి.సత్యనారాయ ణరెడ్డి, జి.జయరామిరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎన్వీ.రామకృష్ణ, వాకిటి మాదేష్, ఉలిందకొండ టీడీపీ నాయకులు ఈవీ రమణ, జిలాని, మస్తాన్‌నాయుడు, విజయ్, రమణారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: కల్లూరు మండలం దొడ్డిపాడు గ్రామంలో వైసీపీకి 30 కుటుంబాలు టీడీపీ పాణ్యం అభ్యర్థి గౌరుచరిత సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం పుసులూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దొడ్డిపాడు వైసీపీకి చెందిన సయ్యద్ హుస్సేన్, ఉస్మాన్‌బాషాతోపాటు పలువురు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో నజీర్‌బాషా, జిలానీ బాషా, నూర్‌బాషా, సిలార్‌బాషా, ఎస్.ఖాసీం, బందేనవాజ్, మిన్నల్ల, నబీ రసూల్, ఆటోశేక్షా, దస్త గిరి, మాసూవలి ఉన్నారు. కార్యక్రమంలో సాయి తరుణ్, మాహబూబ్‌బాషా, ఖాజాహుసేన్, సయ్యద్ ఖాసీం పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన రాయలసీమ జేఏసీ నేతలు

పసుపు కండువా వేసి ఆహ్వానించిన చంద్రబాబు


టీడీపీలో చేరిన రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులతో టీడీపీ అధినేత చంద్రబాబు, గౌరు వెంకటరెడ్డి

కర్నూలు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో బుధవారం రాయలసీమ జేఏసీ నేతలు పసుపు కండువా కప్పుకున్నారు. నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ చైర్మన్ బి.శ్రీరాములు, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి బి.నాగరాజు, జేఏసీ నాయకులు ఓర్వకల్లు రాజు, లక్ష్మణ్, నవీన్, చందుతోపాటు 12 మందికిపైగా నాయకులు ఉండవల్లిలోని చంద్రబాబు ఇంటికి చేరుకున్నారు. వారికి కుండువాలు వేసి చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక సీమ అభివృద్ధికి పెద్దపీట వేయాలని బాబును కోరారు. పాణ్యం నియోజకవర్గంలో దోపిడీ, భూకబ్జాలను చంద్రబాబుకు వివరిస్తే ప్రత్యేక విచారణ చేయిస్తానని బాబు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ శ్రీరాములు మాట్లాడుతూ రాయలసీమ ప్రగతి చంద్రబాబు ద్వారానే సాధ్యమని అన్నారు. చంద్రబాబును కలిసిన వారిలో సర్పంచుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుట్టపాడు సర్పంచ్ మోహన్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు పాలకొల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ: ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో శేషిరెడ్డి

గూడూరు, ఫిబ్రవరి 28: రాబోవు ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆర్డీవో శేషిరెడ్డి అన్నారు. బుధవారం గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీవో రాబోవు ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో శేషిరెడ్డి మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గంలో కొత్తగా 15,917 మంది ఓటర్లు చేరారని, దీంతో నియోజకవర్గంలో మొత్తం 2,41,767 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 275 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అందులో 11 చోట్ల పోలింగ్ కేంద్రాలను మార్చేందుకు ప్రతిపాదనలు, అలాగే 84 చోట్ల పోలింగ్ కేంద్రాల గదుల పేర్లు చేర్చడం కోసం ప్రతిపాదనలు చేశామని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఖర్చు రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి ఖర్చు రూ.95 లక్షలు ఉందన్నారు. అభ్యర్థుల ఖర్చులు చూసేందుకు అధికారుల బృందం ఉంటుం దని, అలాగే వాహనాల అనుమతి, పోలింగ్, కౌంటింగ్ వెళ్ళేవారికి పాసులు, అభ్యర్థుల కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణ గూడూరులోనే ఏర్పాటు చేయాలని ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్డీవోను కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఉదయ్ సంతోష్, ఎన్నికల డీటీ ప్రవీన్, టీడీపీ తరఫున పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, వైసీపీ తరఫున నగర పంచాయతీ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న, బీజేపీ తరఫున మల్లేష్ నాయుడు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన



అవయవ దానం చేసేందుకు అంగీకార పత్రంపై సంతకాలు చేసిన దంపతులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 28: స్థానిక డాక్టర్స్ కాలనీలోని భాష్యం పాఠశాలలో బుధవారం అవయవ దానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు ఎండీ సోఫీయా, వాసవి, శ్రీలతలు అవయదానంపై పోస్టర్ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థి సోఫియా తల్లిదండ్రులు పాటిల్ గౌరి, మల్లికార్జున గౌడు అవయవ దానం చేసేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డోనర్ రిజిస్ట్రేషన్ అంగీకార పత్రంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చిన సోఫియా తల్లిదండ్రులకు పాఠశాల యజమాన్యం అభినందనలు తెలిపింది.

కల్లపరి వైసీపీ సర్పంచ్ టీడీపీలో చేరిక


విష్ణు సమక్షంలో టీడీపీలో చేరిన కల్లపరి సర్పంచు రంగమ్మ తదితరులు

కర్నూలు(రూరల్)/కోడుమూరు(రూరల్): ఫిబ్రవరి 28: కోడుమూరు మండలం కల్లపరి గ్రామ పంచాయతీకి చెందిన వైసీపీ సర్పంచు బోయ వాడిగ రంగమ్మ కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. రంగమ్మకు విష్ణువర్ధన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. సర్పంచుతోపాటు ఉపసర్పంచు లక్ష్మీ, వార్డు సభ్యులు పెద్దరంగడు, కురువ ఈరన్న, సుంకులమ్మ మరో వార్డు సభ్యుడు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా సర్పంచు రంగమ్మ మాట్లాడుతూ వైసీపీ హయాంలో గ్రామం ఏ మాత్రం కూడా అభి వృద్ధి చెందలేదన్నారు. సర్పంచులకు కేటాయించిన నిధులను సైతం జగన్‌రెడ్డి నొక్కేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచుతోపాటు మల్లికార్జున, సోమప్ప, రామాంజనేయులు, రంగన్న, జంగం మల్లికార్జున, సూరి, ఉరుకుంద, దానియేలు, రామచంద్ర, ఈరన్న, డి.రామచంద్ర టీడీపీలో చేరారు.

దళితుల భూములకు రక్షణ కల్పించండి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 28: దళితుల భూములకు రక్షణ కల్పించా లని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం మునగాలపాడులో బాధిత రైతులతో వారు కలిసి అధికారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ గ్రామ పరిధిలో కేసీ కెనాల్ కింద 100 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న దళితుల భూములు అన్యాక్రాం తం కాకుండా చూడాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్య క్షుడు జి.కృష్ణ, డి.విజయమ్మ, గంధం ఉసేనమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆంద్రా గురుస్వామి పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 28: ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఓరియెంటల్, నేషనల్, న్యూ ఇండియా, యునైటెడ్ ఇండియాల్లో పనిచేస్తున్న బీమా ఉద్యోగులు జేఎఎఫ్‌టీయూ అధ్వర్యంలో గాంధీనగర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా జేఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ రఘుబాబు మాట్లాడుతూ ఆగస్టు 2022 నుంచి ఉద్యోగులకు అపరిష్కృతంగా ఉన్న వేతన సవరణ తక్షణమే చేపట్టాలని కోరారు. కార్యక్ర మంలో నాయకులు పవిత్ర కుమార్, సురేష్, నాగరాజు, క్రిష్ణమోహన్ పాల్గొన్నారు.

సీపీఐ సమావేశాన్ని జయప్రదం చేయండి

కోడుమూరు, ఫిబ్రవరి 28: సీపీఐ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్రిష్ణ పిలుపునిచ్చారు. స్థానిక స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మార్చి 2న కర్నూలు దేవి ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా సీపీఐ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించనున్నామని అన్నారు. ఈకార్యక్రమానికి జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రామచంద్రయ్య, చేతి వృత్తిదారుల సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య హాజరవుతాని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్, సీపీఐ నాయకులు రాజు, మధు పాల్గొన్నారు.

ముడుమాలలో పోలీసు సోదాలు

సి.బెళగల్, ఫిబ్రవరి 28: మండలంలోని ముడుమాల గ్రామంలో బుధవారం కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్ఐలు బాలనరసింహుడు, హనుమంతయ్య, తిమ్మారెడ్డి గ్రామంలోని అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ మం డలంలోని ముడుమాలలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ చేశామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మండలంలోని ఆలయాలు, బస్టాండులలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ



కోడుమూరు, గూడూరులో బాధిత కుటుంబాలకు చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 28: మండలంలోని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నాగార్జున గౌడ్ కుటుంబానికి రూ.3లక్షల చెక్‌ను ఆ పార్టీ నాయకులు బుధవారం అందజేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో ఆవేదనకు లోనై నాగార్జునగౌడ్ గుండెపోటుతో మృతి చెందాడు. రాష్ట్ర వ్యాప్తంగా నిజం గెలవాలి పేరుతో చంద్రబాబు సతీమణి నారా భువనే శ్వరీ బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న సంగతి తెలిసిందే. అయితే అని వార్య కారణాలతో ఆమె పర్యటన వాయిదా పడడంతో టీడీపీ నాయకులు చెక్ అందజేశారు. అధైర్యపడవద్దని పార్టీ అండగా ఉంటుందని కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో ఆదుకున్న నారా భువనేశ్వరికి రుణపడి ఉంటా మని బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు వెంకటేశ్వర్లు యాదవ్, రాఘవేంద్రయాదవ్, రంగన్న యాదవ్ పాల్గొన్నారు.

గూడూరు: చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మండల కేంద్రమైన గూడూరులో టీడీపీ అభిమానులు బోయ గౌరన్న, షేక్షావలిబాషా, పెంచికలపాడులో మాబు బాషాలు గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం బాధిత కుటుంబాలను టీడీపీ నాయకులు ఎల్ సుధాకర్ రెడ్డి, గజేంద్ర గోపాల్ నాయుడు, ఎస్ఏ సలీం, దండు సుందరరా జులు పరామర్శించి ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు మన్సూర్‌బాషా, నాగప్పయాదవ్, భాస్కర్‌రెడ్డి, సులేమాన్, కళ్యాణ్ రఘు, వెంకటరాముడు, కర్ణం చిన్న గిడ్డయ్య, ఎంపీటీసీ మద్దిలేటి, కర్ణం యుగంధర్ పాల్గొన్నారు.

బీజేపీతోనే ఆర్థిక వ్యవస్థ బలోపేతం

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 28: దేశంలో బీజేపీతోనే ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజాపోరు యాత్ర-2లో భాగంగా బుధవారం రాత్రి ఆయన నగరంలోని ఇందిరాగాంధీ నగర్, వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో వాహనాల్లో తిరుగుతూ బీజేపీ అందిస్తున్న వివిధ పథకాలపై ప్రచారం చేశారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల క్యాలెండర్లను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్య దర్శి సురవరం గీతామాధురి, మహిళా విభాగం ప్రతినిధులు జయశ్రీ యాదవ్, అనిత జ్యోతి, రాజేశ్వరి, జిల్లా అధికార ప్రతినిధి రామాంజినేయులు, నాయకులు ఆవిలిన్ బాబు, శ్రీరాములు యాదవ్, మధుగౌడ్, శివయ్య శెట్టి పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభను చాటుకోవాలి: కేవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 28: జాతీయ స్థాయి టెక్నికల్ సింపోసియమ్‌లలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. గురువారం నగర శివారు దూపాడు లోని కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కిట్స్ 2కె24 జాతీయ స్థాయి టెక్నికల్ సింపోసియమ్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, రాయలసీమ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీ రంగంలో ప్రతి ఒక్కరూ అప్‌డేట్ కావాలన్నారు. డాక్టర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సాంకేతిక రంగంలో ముందుకు వెళ్తూ మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ నమూనాలను వివరించే స్టాళ్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ కే కన్నాకు మార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



ఆర్‌యూలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు, నారాయణ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 28: రాయలసీమ యూనివర్సిటీలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం కళాశాలలో సీవీ. రామన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలని, అప్పుడే పలు సమస్యలకు పరిష్కా రం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జీకే శివశంకర్ యాదవ్, విజయపుష్పవాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): మనిషి జీవితంలో సైన్స్ అండ్ టెక్నాలజీ ఒక భాగమైందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. నగరంలోని మాధవనగర్‌లో ఉన్న నారాయణ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యా వైద్య విజ్ఞాన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ప్రిన్సిపాల్ అల్తాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ఓర్వకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. హెచ్ఎం రామచంద్రా రెడ్డి మాట్లాడారు. అనంతరం నన్నూరు గ్రంథాలయ శాఖలో గ్రంథాలయ అధికారిని కౌసల్య ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

కోడుమూరు(రూరల్): మండలంలోని అమడగుంట్ల ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా రామన్ ఎఫెక్ట్‌ను ఆవిష్కరించిన సర్ సీవీ రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా హెచ్ఎం అనంతయ్యయాదవ్ మాట్లాడారు.

రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయండి: జేసీ

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 28: రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య వివిధ బ్యాంకు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అన్ని బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పెట్టుకున్న లోన్ అర్జీలను వెంటనే పరిశీలించి పశుకిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశానికి జేడీలు రామచంద్రయ్య, వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ రమా దేవి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రరావు, కేడీసీసీ,కెనరా, యూనియన్, ఎస్‌బీఐ, ఏపీజీబీ, బీవోఐ, ఏపీజీబీ, యూపకో, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

నేడు కేవీఆర్ కళాశాలలో గాడిచర్ల వర్ధంతి సభ

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 28: స్వాతంత్ర సమరయోధుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 64వ వర్ధంతి సభను గురువారం ఉదయం 10 గంటలకు నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల్లో ఏర్పాటు చేసినట్లు గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యవక్తగా హైదరాబాదు మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు మహబూబ్ బాషా హాజరవుతారని తెలిపారు.

నేడు 'వింధ్య' పుస్తకావిష్కరణ సభ: కర్నూలుకు చెందిన ప్రముఖ నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ రాసిన 'వింధ్య' (రేడియో నాటికల సంపుటి) పుస్తక ఆవిష్కరణ సభ గురువారం సాయంత్రం 4 గంటలకు నగరంలోని బి.క్యాంపు లోగల సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల్లో ఏర్పాటు చేసినట్లు క్లస్టర్ యూనివర్సిటీ అధ్యాపకులు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా వర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, సభాధ్యక్షుడిగా సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య హాజరవుతారన్నారు.

బాలల న్యాయ చట్టంపై శిక్షణ

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 28: బాలల హక్కుల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో బాలల న్యాయ చట్టంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ హాజరై మాట్లాడుతూ అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు తగ్గుముఖం పట్టాయన్నారు. బాలల పరిశీలన వసతి గృహం సూపరింటెండెంట్ బాషా, కర్నూలు రూరల్ సీడీపీవో అనూరాధ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి శారద, దిశా పోలీసు ఎస్ఐ ఆశాలత, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కోఆర్డినేటర్ సుంకన్న, బీబీఏ కో-ఆర్డినేటర్ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

సంక్రమిత వ్యాధులపై అవగాహన అవసరం

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 28: సంక్రమిత వ్యాధులపై విద్యార్థులకు అవగాహన అవసరమని కర్నూలు వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. సింధీయా శుభప్రద అన్నారు. బుధవారం డాక్టర్ అబ్దుల్ హాక్ ఉర్దూ యూని వర్సిటీలో జాతీయ సైన్స్ డేను పురస్కరించుకొని సంక్రమిత వ్యాధులు.. నివారణ .. నియంత్రణ చర్యలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటిస్తే సంక్రమిత వ్యాధులు దరి చేరవన్నారు. ఆమెను శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జహ నారా, ఎన్ఎండీ అక్రమ్, నిర్మల, నబియా సుల్తానా పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 28: గత సంవత్సరం మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వైఎస్ఆర్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వైవీ రమణ డిమాండ్ చేశారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వర రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రేణుక, మహేశ్వరి, మారెన్న పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన బీవీ జయనాగేశ్వరరెడ్డి


టీడీపీ అధినేత చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే బీవీ

కర్నూలు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి గురువారం టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ మేరకు దాదాపు 25 నిమిషాలకు పైగా చంద్రబాబుతో బీవీ జయనాగేశ్వర రెడ్డి మాట్లాడారు. టీడీపీ టికెట్ కోసం వైసీపీ అభ్యర్థి, మాజీ ఎంపీ బుట్టా రేణుక అల్లుడు, దివంగత మాచాని సోమప్ప కుటుంబానికి మాచాని సోమనాథ్, కర్నూలు నగరానికి చెందిన రాయలసీమ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొంగతి లక్ష్మీనారాయణ ఆశించారు. ఈ క్రమంలో సోమనాథ్ తనకే టికెట్ వస్తుందని ప్రచారం చేస్తూ ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. ఈ నెల 24న శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు 94 మంది అభ్యర్థులతో విడుదల చేసిన తొలి జాబితాలో ఎమ్మిగనూరు అభ్యర్థి పేరు లేకపోవడంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో బీవీ జయనాగేశ్వర రెడ్డి చంద్రబాబును కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. చంద్రబాబు నుంచి టికెట్ కేటాయింపుపై స్పష్టమైన సమాధానం వచ్చినట్లు బీవీ వర్గీయుల ద్వారా తెలుస్తోంది. చంద్రబాబుతో భేటీ సమయంలో టికెట్‌పై బీవీ జయనాగేశ్వర రెడ్డికి అనుకూలంగా క్లారిటీ వచ్చిందంటూ విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఓట్లు కావాలంటే సీపీఎస్ రద్దు చేయండి

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 28: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాల ఓట్లు కావాలంటే సీపీఎస్‌ను రద్దు చేయాలని, లేదంటే రద్దు చేసే పార్టీల పక్షాన నిలుస్తామని యూటీఎఫ్ నాయకులు స్పష్టం చేశారు. బుధవారం క్రిష్ణగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో ఓట్ ఫర్ ఓపీఎస్ పుస్తకాలను ఆవిష్కరించారు. వైసీపీ ప్రభుత్వం 2019 ఎన్నికల ముందు పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగులకు మొండిచెయ్యి చూపిందని విమర్శించారు. నాయకులు ప్రసాద్‌రెడ్డి, దుర్గా ప్రసాద్, నారాయణరెడ్డి, నాగరాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

దేవనకొండ, ఫిబ్రవరి 28: ప్రభుత్వం సబ్సిడీ రుణాలు, స్థలంతోపాటు ఇంటి నిర్మాణాలు చేపట్టి టైలర్లను ఆదుకోవాలని టీడీపీ మండల నాయకులు బడిగింజల రంగన్న, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కరీం, అజీజ్ అన్నారు. టైలర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక మూగితాత దర్గా ఆవరణలో 14వ వార్షికోత్సవం నిర్వహించారు. సీనియర్ టైలర్లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో బాషా, రామాంజినేయులు, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఆలూరు : స్థానిక జ్యోతిబసు భవనన్‌లో టైలర్స్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు నారాయణ స్వామి, టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీక్, గౌరవ అధ్యక్షులు పార్థసారథి మాట్లాడారు.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని శివసర్కిల్ నుంచి సోమప్ప సర్కిల్ వరకు టైలర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలర్ల సంక్షేమం కోసం సంఘం గౌరవాధ్యక్షుడు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేఎం నాగభూషణం, ఉపాధ్యక్షుడు నిస్సార్ అహ్మద్, కార్యదర్శి సాబీర్, సహాయ కార్యదర్శి ఉరుకుందప్ప, ట్రెజరర్ అమ్రేష్ గౌడ్, సలీం బేగ్, ఈరన్న పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన అధికారంలోకి రావడం ఖాయం


ఆదోనిలో ప్రచారం నిర్వహిస్తున్న ఉమ్మి సలీం

ఆదోని, ఫిబ్రవరి 28: ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ-జనసేన అధికారంలోకి రావడం ఖాయమని టీడీపీ సీనియర్ మైనార్టీ నాయకులు ఉమ్మి సలీం అన్నారు. ఆదోని పటణంలో గౌకర్ జెండా కాలనీలో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీలో పాల్గొని ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోసఫ్, బాస్కర్, ఈరన్న, ఫయాజ్, సమీర్ పాల్గొన్నారు.

యువకవి రాజశేఖర్‌కు రాయల సాహితీ పురస్కారం

ఆలూరు, ఫిబ్రవరి 28: సత్యసాయి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారిగా కవితా యాత్ర కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన యువ రచయిత ఎం రాజశేఖర్‌కు రాయల సాహితీ పురస్కారం లభించింది. జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సన్మానం చేశారు. చారిత్రక స్థలంలో ఒకప్పటి అష్టదిగ్గజ కవులు జరిపిన సాహితీ వైభవంపై వివరించాడు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్ బాషా, ఉమర్ షారుక్ ఖాన్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చదువుల బాబు, పెనుగొండ పురప్రముఖులు పాల్గొన్నారు.

సమస్యల్లో లక్కందిన్నె

● 40 ఏళ్లుగా నీరు లేదు.. రోడ్లు లేవు ● శిథిలావస్థలో పాఠశాల

దేవనకొండ, ఫిబ్రవరి 28 : మండలంలోని ఐరన్‌బండ గ్రామ పంచాయతీ పరిధిలోని మజరా గ్రామం లక్కందిన్నె సమస్యలతో సతమతమవుతోంది. దాదాపు నలభై ఏళ్లుగా గ్రామంలో సీసీ రోడ్లు లేవు. పాఠశాల భవనాలు పాతబడి శిథిలావస్థకు చేరింది. గాజులదిన్నె ప్రాజెక్టు నిర్మాణం కావడంతో నలభై ఏళ్ల కిందట నిర్వాసితులతో లక్కందిన్నె గ్రామాన్ని ఏర్పాటు చేశారు. నాటి నుంచి అభివృద్ధికి నోచుకోలేదని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు లేవు. తాగేందుకు మంచినీరు లేదు.

ఇక్కడ అన్నీ సమస్యలే

తాగేందుకు మంచినీళ్లు లేవు ప్రాజెక్టు దగ్గర ఉన్న గ్రామంలో వేసిన ప్రతి బోరు మొదట్లో మంచినీళ్లు పారి కొన్నాళ్ల తరువాత ఉప్పునీళ్లు మారుతాయి. తాగేందుకు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసిన పని చేయదు. పాఠశాల కూడా శిథిలావస్థకు చేరింది.

- సురేష్
లక్కందిన్నె గ్రామస్తుడు


గ్రామంలో కానరాని సీసీ రోడ్లు

ఉప్పునీటితోనే దాహం తీర్చుకుంటున్నామని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. రెండేళ్ల కిందట గ్రామంలో మంచినీటికోసం మినరల్ వాటర్ ప్లాంట్ రూ.5 లక్షలు ఖర్చు చేసి అధికార పార్టీ నాయకులు ఏర్పాటు చేశారు. మంత్రి గుమ్మనూరు జయరాం ప్రారంభించిన వారం రోజులకే పని చేయకుండా పోయింది. గ్రామంలో పాఠశాల భవనం శిథిలమైంది. మూడు గదులు ఉంటే ఒక గది పాడుబడింది, మరో గదిలో వస్తువులు సామగ్రికే సరిపోయింది. ఒక గది, వరండా ప్రాంతంలో చదువులు సాగుతున్నాయి.

టీడీపీలో వైసీపీ నాయకుల చేరిక


టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 28 : గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు బుధవారం పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వెంకటేష్, గోపాల్, రాజు, ఇండ్లసూరి, వడ్లకృష్ణ, మద్దిలేటి, రంగడు, రాజు, వడ్డే శివ, చాకలి శివ, అంజితోపాటు మిత్రుల కుటుంబాల పెద్ద సంఖ్యలో జ్ఞానేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో కంబాలపాడులోని కేఈ శ్యాంబాబు స్వగృహంలో టీడీపీ కండువాలు వేసుకున్నారు. ముందుగా కేఈ శ్యాంబాబును, జ్ఞానేశ్వర్‌గౌడ్‌ను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గోవర్ధనగిరి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కష్టాల్లో ఉన్నారని, టీడీపీ అధినేత నారాచంద్రబాబు నాయుడు సీఎం అయితేనే సమస్యలు తీరుతాయని స్పష్టం చేశారు. మాజీ మండల అధ్యక్షులు సూదేపల్లె జయరాముడు, వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం టికెట్ తిక్కారెడ్డికే ఇవ్వాలి

కౌతాళం, ఫిబ్రవరి 28: కష్టకాలంలో పార్టీ అభివృద్ధికి పాటుపడుతూ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా నిలుస్తున్న టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డికే మంత్రాలయం ఎమ్మెల్యే సీటు కేటాయించాలని టీడీపీ రైతు సంఘం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అడివప్పగౌడ్, వెంకటపతిరాజు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన టీడీపీ మండల నాయకుల, కార్యకర్తల సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ నాయకుడు ఉసేని, మండల నాయకులు కాశీవిశ్వనాథ, రమేష్‌గౌడ్, బాపురం వెంకటరెడ్డి, కురుగోడు, నదిచాగి దేవరాజుగౌడ్, కుంటనహల్ దొడ్డనగౌడ్, బసన్నగౌడ్, రాజానందు, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం : తిక్కారెడ్డి వెంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ వర్గాలు కలిసికట్టుగా ఉన్నామనీ టీడీపీ మంత్రాలయం కన్వీనర్ పన్నగ వెంకటేశ్, పూజారి వ్యాసరాజాచార్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, క్లస్టర్ ఇన్‌చార్జి ఎల్లారెడ్డి అన్నారు. బుధవారం పన్నగస్వామి ఇంటి దగ్గర మంత్రాలయం టీడీపీ సమావేశం నిర్వహించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. పదేళ్లుగా పార్టీ కోసం కేసులు ఎదుర్కొంటూ కార్యకర్తలను కాపాడుకొంటూ పార్టీ అభివృద్ధికి పాటుపడ్డారని పేర్కొన్నారు. నాయకులు అశోక్ రెడ్డి, విజయరామిరెడ్డి, వగరూరు పవన్ కుమార్ రెడ్డి, అబ్దుల్లా, గోపాల్, బెస్త ఈరన్న, పవన్, ఎస్ఎం గోపాల్ రెడ్డి,చంద్ర, జెట్టి వీరేష్ వెంకట్రాముడు, కేశన్న, ఆర్‌సీ ఏసేబు తదితరులు పాల్గొన్నారు.


మంత్రాలయంలో తీర్మానం చేస్తున్న టీడీపీ నాయకులు

జాగ్వార్ ప్రత్యేక షోరూం ప్రారంభం


జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న పెండ్యాల హరి బాబు, మీనాక్షినాయుడు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 28: పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డు బైపాస్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన అతి పెద్ద జాగ్వార్ ప్రత్యేక షోరూమ్‌ను బుధవారం సూర్య ఇంటర్నేషనల్ ఎండీ పెండ్యాల హరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ రంగంలో గతంలో బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌లకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారని, కానీ ప్రస్తుతం బాత్రూంల ఏర్పాటులో విప్లవాత్మకమైన మార్పులు రావడంతో వాటిని హైజెనిక్‌గా నిర్మించడానికే ఆసక్తి చూపిస్తున్నారని అన్నారు. వ్యాపార రంగంలో పేరుపొందిన లక్ష్మీనారాయణ గుప్తా, అభిలేష్ గుప్తా వారి ఆధ్వర్యంలో రాష్ట్రంలో తమ 28వ ప్రత్యేక షోరూంను ఆదోనిలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సూర్య ఇంటర్నేషనల్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల బ్రాంచ్ హెడ్ అభిజిత్ సింగ్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

● కందనాతిలో కొనసాగుతున్న పోలీస్ పికెటింగ్

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 28: కందనాతి గ్రామంలో ఈ నెల 21న జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నరసింహులు(53) మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, గ్రామస్థుల వివరాల మేరకు.. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య ఆదేశాల మేరకు గ్రామంలో పోలీస్ పికెటింగ్‌ను ఏర్పాటు చేశారు. మృతి చెందిన నరసింహులు కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

నిందితుల అరెస్టు: కందనాతి గ్రామంలో ఘర్షణకు పాల్పడి ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమైన 12 మంది నిదితులను బుధవారం రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది దాడి చేసి అరెస్టుచేశారు. సీఐ మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు నిందితులు గ్రామ సమీపంలో ఉన్న బోయ నరసయ్య పొలంలో ఉన్న నీటి ట్యాంకు వద్ద ఉన్నారన్న సమాచారంతో వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. బోయ గోవిందు, బోయ లోకేష్, బోయ వెంకటేష్, బోయ శ్రీను, బోయ నరసయ్య, బోయ పరమేష్, బోయ మారెన్న, బోయ ఈరన్న, బోయ కేశన్న అలియాస్ గొర్రెల కేశన్న, బోయ మహేష్, బోయ కేశన్న అలియాస్ గువ్వోడు, బోయ మారెన్న ను కోర్టులో హాజరు పరచగా జడ్జీ రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ పరికరాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.


చిప్పగిరి విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలు

ఆలూరు, ఫిబ్రవరి 28: విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి ప్రదర్శించినప్పుడే గుర్తింపు లభిస్తుందని ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ విక్రమ్ రాజు అన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సీవీరామన్ సైన్స్‌డేను పురస్కరించుకొని గత వారం విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ బాలుర హై స్కూల్‌లో బహుమతులను ఆయన అందించారు. మొదటి బహుమతి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బీ కావ్య, ద్వితీయ బహుమతి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి యన్ ప్రవళిక, మూడవ బహుమతి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని గౌతమి అందుకున్నారు. హెచ్‌ఎం వరప్రసాద్, గ్రంథాలయాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోసిగి : మండల పరిధిలోని కందుకూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు, సైన్స్ ముగ్గుల పోటీలను నిర్వహించారు. జాతీయ సైన్స్ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా అంతరిక్షంపై అవగాహన కార్యక్రమం, నాసాలో పని చేసిన జూనియర్ శాస్త్రవేత్త సాయి కుబేర్‌తో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వెంగమ్మ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ప్రభాకర్‌రావు, ఈశ్వరప్ప, పద్మావతి, సంజీరెడ్డి, శ్రావణి తదతరులు ఉన్నారు.

పత్తికొండ టౌన్ : స్థానిక యశోద గార్డెన్ హై స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు నిర్వహించిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ఇక్బాల్, లక్ష్మీనారాయణ, నాగరాజు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

గోనెగండ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ డేను నిర్వహించి డాక్టర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. హెచ్‌ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు రాజేష్, మురళి, తాజుద్దీన్, ఖాదర్‌బాషా, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా)తో పాటు మహిళ విభాగం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎస్కేడీ కాలనీలోని కిడ్స్ కోచ్ స్కూల్లో నేషనల్ సైన్స్‌డే సందర్భంగా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల నమూనాలను చిత్రపటాలను రూపొందించి ప్రదర్శించారు.

చిప్పగిరి : స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. హెచ్‌ఎం లతీఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రయోగ నమూనాలు ఆలోచించే విధంగా ఉన్నాయి. చిప్పగిరిలోని ప్రధాన ప్రాథమిక, కస్తూరిబా ఫాతిమా పాఠశాల విద్యార్థులు, ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన నమూనాలను తిలకించారు. ఉపాధ్యాయులు రమాదేవి, శ్రీనివాసులు, టిప్పు ఖాన్, నగేంద్ర పాల్గొన్నారు.

ఆదోని (అగ్రికల్చర్) : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మున్సిపల్ హై స్కూల్, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల, మిల్టన్ గ్రామర్ ఉన్నత పాఠశాలలో సైన్స్‌డేను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయులు రామయ్య, సుధాకర్, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

వెల్దుర్తి, ఫిబ్రవరి 28 : మండలంలో అల్లుగుండు గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. చెక్‌డ్యామ్‌లలో పూడీకతీత పనులు, కూలీల హాజరును పరిశీలించారు. గ్రామాల్లో వలసలు వెళ్లకుండా అడిగిన వారందరికీ పనులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం వెల్దుర్తి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కూలీల హాజరు ఆన్‌లైన్ వర్క్‌షీట్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. గ్రామాల వారీగా వర్క్ ఫైల్స్, రికార్డులను తనిఖీ చేశారు. జాబ్ కార్డులు, ఉపాధి రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో అప్‌డేట్‌గా ఉండాలలని సూచించారు. ఏపీవో రాజునాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

16 నుంచి జాతీయ స్థాయి సేపక్ తక్రా పోటీలు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 28: మార్చి 16 నుంచి ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో జాతీయ అంతర్ విశ్వవిద్యాలయాల సేపక్ తక్రా పోటీలను నిర్వహిస్తున్నట్లు రాయలసీమ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ తెలిపారు. బుధవారం ఆర్‌యూ ఫిజికల్ డైరెక్టర్లు శివ కిషోర్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ మూర్తితో కలిసి క్రీడా మైదానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఆయా విశ్వవిద్యాలయాల నుంచి సేపక్ తక్రా క్రీడకారులు పాల్గొన్నారు. మార్చి 16 నుంచి 21వ తేదీ వరకు ఈ క్రీడా పోటీలు జరుగుతాయి అన్నారు. అయా విశ్వవిద్యాలయాల నుంచి వచ్చే క్రీడాకారులకు వసతులు కల్పిస్తామని తెలిపారు. పోటీలు జరిగే వేదిక వసతి ఏర్పాట్లపై కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్‌కు పలు సూచనలు చేశారు.

అధిష్టానం ఆదేశిస్తే పత్తికొండ బరిలో నిలుస్తా

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 28: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో అధిష్టానం ఆదేశిస్తే పత్తికొండ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలుస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పులికొండ సద్దాం హుశేన్ అన్నారు. బుధవారం విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పత్తికొండ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ నాగార్జునతో కలిసి సద్దాం హుశేన్ పత్తికొండ అసెంబ్లీసీటును తనకు కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నానని, వచ్చే ఎన్నికల్లో తనకు పత్తికొండ అసెంబ్లీ సీటును ఇస్తే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీల్లో నిలుస్తానని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తుగ్గలి, ఫిబ్రవరి 28: ఆటో-ద్విచక్ర వాహనం ఢీకొని కర్నూలు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక వెంకట్రాముడు (54) మృతి చెందినట్లు జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. బుధవారం పగిడిరాయి కొత్తచెరువుకు చెందిన వెంకట్రాముడు, మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

జడ్పీటీసీ సోదరుడిపై కేసు

దేవనకొండ, ఫిబ్రవరి 28 : దేవనకొండ జడ్పీటీసీ రామకృష్ణ సోదరుడు శ్రీనివాసులుపై కేసు నమోదైంది. మంగళవారం రాత్రి దేవనకొండ వైసీపీ కార్యకర్త జనర్దన్‌పై దాడి చేయడంతో ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్యాక్షన్ వీడి ప్రశాంతంగా జీవించాలి : డీఎస్పీ

దేవనకొండ, ఫిబ్రవరి 28 : ప్రజలు ఫ్యాక్షన్ వీడి ప్రశాంతంగా జీవించాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కప్పట్రాళ్లలో ఆయన పర్యటించి, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. సీఐ శ్రీనివాసులు ఆయన వెంట ఉన్నారు.

బైపాస్ రహదారి అలైన్‌మెంట్ మార్చాలి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 28: ఆదోని శివారు బైపాస్ రహదారి అలైన్మెంట్ మార్చు చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని భూమి కోల్పోతున్న బాధితులు శ్రీనిధి, శ్రీనివాసులు, నాగరాజు, ఆనంద్ బాబు, పీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బైపాస్ రహదారి వల్ల భూమి కోల్పోతున్న బాధితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత బైపాస్ రహదారి అలైన్మెంట్, మాస్టర్ ప్లాన్ అమలు చేయకుండా కొత్త అలైన్మెంట్ సృష్టించి తమ భూములు లాక్కొని అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పైసా పైసా కూడ పెట్టుకుని ప్లాట్లు కొన్నామని ఇప్పటికే బ్యాంకు రుణాలు తీసుకొని ఇల్లు నిర్మించుకున్నామని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మను కలసి వినతిపత్రం అందజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆదోని, ఫిబ్రవరి 28: ఆదోని పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ పరిశీలించారు. బుధవారం పట్టణంలోని ఎస్కేడీ కాలనీలోని కిడ్స్ స్కూల్, సాయి జూనియర్ కాలేజ్, మరియు బార్‌పేటలోని శారదా నికేతన్ స్కూల్, ఆర్డీవో కార్యాలయం, మరియు మునిసిపల్ కార్యాలయ సమీపంలో ఉన్న సచివాలయాలను ఎన్నికల పోలింగ్ కేంద్రాల నిమిత్తమై పరిశీలించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మద్దికెర, ఫిబ్రవరి 28: మండలంలోని మద్దికెర గ్రామంలోని శ్రీ విద్యాసాయి కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు చీఫ్‌సూపరింటెండెంట్ కిరణ్మయి తెలిపారు. బుధవారం కిరణ్మయి మాట్లాడుతూ మొదటి పరీక్ష సంవత్సరం 147, రెండో సంవత్సరం 144, సప్లిమెంటరీ 118 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. డిపార్టుమెంటల్ అధికారి అంకమ్మరావు, అడిషనల్ సూపరింటెండెంట్ సునీత తదితరులు ఉన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మద్దికెర, ఫిబ్రవరి 28: మండలంలోని ఆదర్శ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాధికారి రంగస్వామి తెలిపారు. బుధవారం ఆదర్శ పాఠశాలలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఇంటర్మీడియట్‌లో 122, పదవ తరగతి 95 మంది విద్యార్థులు ఉన్నారని, వీరికి ప్రత్యేక తరగతులతో పాటు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సవిత, వార్డెన్ ఉషా తదితరులు ఉన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయాలి : సీపీఐ

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 28: పట్టణంలో తాగునీటి బోర్లకు, ట్యాంకులకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, నాయకులు భాస్కర్ యాదవ్, పంపన్న గౌడ్ కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. వేసవి కాలానికి ప్రారంభానికి ముందే పట్టణంలో నీటి కొరత ఏర్పాడి ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. తాగునీటి సమస్యను అధిగమించేందుకు వెంటనే పాడైపోయిన, మరమ్మతులకు గురైన తాగునీటి బోరు పంపులకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సమీవుల్లా, బజారి, మల్లికార్జున గౌడ్, దాదావలి, తిమ్మగురుడు, వీరేష్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

దేవనకొండ, ఫిబ్రవరి 28: ఐదు లీటర్లు నాటుసారా, 45 కేజీల బెల్లం అనుమతులు లేకుండా తరలిస్తున్న మాచాపురం గ్రామానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తిని అరెస్టు చేసిన్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. కొత్తబోదెపాడు స్టేజీ వద్ద మోటర్‌సైకిల్‌పై తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం

పత్తికొండ, ఫిబ్రవరి 28 : పత్తికొండలో జరుగుతున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవ కార్యక్రమాలలో భాగంగా బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం 11 గంటలకు శివపార్వతుల కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. కొత్తగా వివాహం జరిగిన నాలుగు జంటలతో కల్యాణం చేయించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. సాయంత్రం కళ్యాణమూర్తుల ఉత్సవవిగ్రహాలను వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎల్లారెడ్డి, తుప్పటి నాగన్న, సురేష్‌కుమార్, దండిమల్లికార్జున ఉన్నారు.

తిమ్మప్పస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం

మద్దికెర, ఫిబ్రవరి 28: మండలంలోని ఎడవలి గ్రామంలో భక్తుల కోర్కెలు తీర్చే అవధూత తిమ్మప్పస్వామి ఎడవల్లప్పస్వామి గడేదూలప్పస్వామి జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తిమ్మప్పస్వామికి గణపతి పూజ, గంగకు వెళ్లి ఉత్సవ మూర్తులను మేళతాళాల మధ్య తీసుకుని వచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామంలో 29న రాత్రి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తిగల వారు 8897374035ను సంప్రదించాలని సూచించారు.

బీవీ వెంటే మైనార్టీలు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 28: ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలు మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి వెంటే ఉన్నారని టీడీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షకార్యదర్శులు ఉసేన్ పీరా, తురేగల్ నజీర్‌లు అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 40ఏళ్ల క్రితం మాజీ మంత్రి దివంగత బీవీ మోహన్ రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.

చంద్రబాబును కలిసిన కురవ సంఘం నాయకులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 28: ఈ సార్వత్రిక ఎన్నికలలో కర్నూలు జిల్లాలో ఒక పార్లమెంట్ స్థానం, రెండు అసెంబ్లీ స్థానాలు కురువలకు కేటాయించాలని జిల్లా తెలుగుయువత మాజీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర కురువ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ మాజీ సీఎం చంద్రబాబును కోరారు. బుధవారం విజయవాడంలోని ఉండవల్లిలో చంద్రబాబు నివాసంలో ఆయనను కలిశారు. రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకుడు శ్రీరాములు చంద్రబాబు సమక్షంలో టీడీపీ లో చేరిన సందర్భంగా అధిష్టానం పిలుపు మేరకు జేఏసీ నాయకులు కలిశారు.

జగన్‌ను ఇంటికి పంపేందుకు జనం సిద్ధం

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 28: సిద్ధం పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సభలు నిర్వహిస్తున్నారని, కాని రాష్ట్ర ప్రజలు మాత్రం జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎమ్మిగనూరు కన్వీనర్ కేఆర్. మురహరిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఇప్పటిదాకా రాష్ట్రంలో ఏఏ అభివృద్ధి పనులు చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.